జెవికె స్టాక్ పాయింట్ల పరిశీలన


ప్రజాశక్తి -మామిడికుదురు

జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్లను సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు బుధవారం పరిశీలించారు. మండలంలో నగరం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌ను ఎఎల్ఎస్ కో-ఆర్డినేటర్ డి.రమేష్‌బాబు, ఎపిఒ డాక్టర్ ఎంఎస్.భీమారావు, ఎంఇఒ పి.రాంబాబు తనిఖీ చేశారు. స్టాక్ పాయింట్‌లో జెవికె కిట్లలో సామగ్రిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కిట్లలో సరుకులు నాణ్యతగా ఉండేలా చూడాలన్నారు. నాణ్యతలేని వస్తువులు సరఫరా చేస్తే వాటిని తిప్పి పంపే అధికారం క్వాలిటీ కంట్రోల్ సిబ్బందికి ఉంటుందన్నారు. నోట్ పుస్తకాలు కూడా దిగుమతి చేసుకునే సమయంలో ఇండెంట్ ప్రకారం పరిశీలించుకోవాలన్నారు. తేడా వస్తే అధికారులకు తెలియజేయాలన్నారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. వారి వెంట సిఆర్‌పిలు, హెచ్ఎం ఎస్.విజయకుమారి తదితరులున్నారు.

ప్రయివేటు కాలేజీలపై పర్యవేక్షణ

ప్రజాశక్తి - అమలాపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రయివేటు జూనియర్ కళాశాలు, ఒకేషనల్ కళాశాలలపై నిరంతర పర్యవేక్షణ చేయాలని జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీకి కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లాస్థాయి జూనియర్ కళాశాల పర్యవేక్షణ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. బోర్డ్ విధివిధానాలను ప్రయివేటు కళాశాలలు సక్రమంగా పాటిస్తున్నదీ లేనిదీ పరిశీలిస్తుందన్నారు. ఈ కమిటీలో కలెక్టర్ అధ్యక్షులుగా, ఎస్‌పి ఉపాధ్యక్షులుగా, ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి కమిటీ కన్వీనర్‌గా, మున్సిపల్ కమిషనర్ జిల్లా అగ్నిమాపక విపత్తుల స్పందన అధికారి, జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషనల్ అధికారి, డిఎస్‌పి సభ్యులుగా ఈ కమిటీ ఏర్పాటైందన్నారు. జిల్లాలో ఉన్న 101 ప్రయివేటు జూనియర్, ఒకేషనల్ కళాశాలలను కమిటీ పర్యవేక్షించాలన్నారు. బోర్డు నిర్దేశించిన పోర్టల్‌లో అనుసంధాన కొనసాగింపు చర్యలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. నిబంధనలు అనుసరిస్తున్నది లేనిది క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన కళాశాల యజమాన్యాలపై చర్యలు తీసుకునే అధికారి ఈ కమిటీకి ఉందన్నారు. జూనియర్ కళాశాలలు అర్బన్ ప్రాంతంలో ఒక ఎకరం విస్తీర్ణంలో ఆట స్థలాన్ని కేటాయించాలని అదే విధంగా రూరల్‌లో రెండు ఎకరాల విస్తీర్ణంలో ఆట స్థలాన్ని కేటాయించాలన్నారు. జూనియర్ కళాశాల నెలకొల్పేందుకు కనీసం 800 చదరపు అడుగుల విస్తీర్ణంలో భవనాలు ఉండాలన్నారు. ఒకేషనల్ కళాశాలలైతే 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో భవనాలు ఉండాలన్నారు. ప్రతి కళాశాలలో క్వాలిఫైడ్ అధ్యాపకులు ఉండాలని స్పష్టం చేశారు. లైబ్రరీలు అవసరమైన టాయిలెట్లు సంపూర్ణంగా ఉండాలని ఆయన సూచించారు. ప్రతి కళాశాలకు కార్పస్‌ఫండ్ ఉండాలన్నారు. ముఖ్యంగా అగ్నిమాపక నిరోధ పరికరాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో కమిటీ ఉపాధ్యక్షులు ఎస్‌పి ఎస్.శ్రీధర్, కన్వీనర్, ఆర్ఐఒ ఎన్ఎస్‌విఎల్.నరసింహం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా



కొత్తపేటలో అభిమానులకు పవన్ అభివాదం

పంటను కొనే బాధ్యత ప్రభుత్వానిదే...

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్

ప్రజాశక్తి - కొత్తపేట, రావులపాలెం, ఆలమూరు

రైతులు పండించిన పంటను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ అన్నారు. బుధవారం ఆయన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కొత్తపేట మండలం అవిడిలోని వర్షాలకు పాడైన పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. నష్టం వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంటను ప్రభుత్వం కొనే వరకూ జనసేన పోరాడుతుందన్నారు. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని మద్దతు ధరకు వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్, కొత్తపేట నియోజకవర్గ కన్వీనర్ బండారు శ్రీనివాసు తదితరులున్నారు.

అభిమానుల ఘనస్వాగతం

జిల్లాకు వచ్చిన జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు ఘన స్వాగతం లభించింది. ఆలమూరు, రావులపాలెం, కొత్తపేట మండలాల్లో పవన్ అభిమానులు పూలమాలలతో స్వాగతం పలికారు. కొత్తపేట మండలం బోడిపాలెం వద్ద భారీ గజమాలతో ఆయనకు స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు. రావులపాలెం పోలరంలో కోనసీమ ముఖద్వారం ఆర్చి వద్ద పూలవర్షం కురిపించారు. స్వాగతం పలికిన వారిలో జనసేన నాయకులు తోట సన్యాసి, అంబటి కిషోర్, బంటు రవికుమార్, బండారు బాబి, దొంగ వెంకట సుబ్బారావు, తాళ్ల డేవిడ్ రాజు, అంబటి మణికంఠ, గిద్ద వెంకటేష్ పాల్గొన్నారు.



ఆలమూరులో వరికంకులను పరిశీలిస్తున్న పవన్‌కళ్యాణ్

రైతు భరోసా కేంద్రాలా? రైతు దివాళా కేంద్రాలా?

ప్రజాశక్తి - అమలాపురం

ప్రభుత్వ తీరుతో రైతు భరోసా కేంద్రాలు రైతు దివాళా కేంద్రాలుగా మారాయని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరావు విమర్శించారు. ఇటీవల కాలంలో ధాన్యం సేకరణ అంశంలో రైతులు ఎదుర్కొంటున్న ఒక్క సమస్యకూ రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చూపలేదన్నారు. మిల్లర్ల దయాదాక్షిణ్యాలు తప్ప రైతులకు ఎక్కడా న్యాయం జరగట్లేదన్నారు. ఆర్‌బికెల్లో తీసుకున్న ప్రమాణాలు మిల్లర్ల వద్దకు వెళ్లగానే మారిపోతున్నాయన్నారు. తేమ, నూక, తాలు పేరుతో బస్తాకు ఏడు నుంచి 12 కేజీల వరకూ కోత పెడుతున్నారన్నారు. ఆ పేరుతో ట్రక్కుకు రైతుల నుంచి రూ.7 వేల నుంచి రూ.10వేల వరకూ వసూలు చేస్తున్నారని తెలిపారు. తడిచిన ధాన్యాన్ని ఎక్కడా కొనుగోలు చేయడం లేదన్నారు. ఆర్‌బికెల వద్ద డ్రయ్యర్లు, క్లీనర్లు, టార్పాలిన్‌లు లేవన్నారు. గోనెసంచులు ఇవ్వడం లేదని, ఇచ్చిన వాటిలోనూ చిరిగినవే ఎక్కువగా ఉంటున్నాయన్నారు. అలాగే ఉపాధి హామీ కూలీలకు చట్టం ప్రకారం రూ.400లు ఇవ్వాల్సి ఉండగా రూ.200కు మించి ఇవ్వట్లేదన్నారు. వేసవిలోనూ వారితో రెండు పూటలా పనిచేయిస్తున్నారన్నారు. ఉపాధి కూలీలకు ఫేషియల్ హాజరు తీసుకోవడం తగదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి వ్యతిరేకంగా మే 15న కలెక్టర్ వద్ద ధర్నా నిర్వహించనున్నామని తెలిపారు. దీన్ని విజయవంతం చేయాలని కోరారు.



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షుశుక్లా

ప్రశాంతంగా పాలిసెట్

ప్రజాశక్తి - అమలాపురం

పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు బుధవారం నిర్వహించిన పాలీసెట్-2023 ప్రవేశపరీక్ష ప్రశాంతంగా ముగిసిందని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎస్‌కెబిఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష నిర్వహణా తీరును ఆయన పరిశీలించారు. అభ్యర్థులు భయాందోళనలకు గురి కాకుండా నిర్దేశిత సమయంలో పరీక్ష రాసి మంచి మార్కులతో పాలిటెక్నిక్ కళాశాలల్లో సీట్లు పొందాలని ఆకాంక్షించారు. ఈ పరీక్షకు పటిష్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో 19 కేంద్రాల్లో పరీక్ష జరిగింన్నారు. రామచంద్రపురంలో 6 కేంద్రాలు, ముక్తేశ్వరంలో రెండు కేంద్రాలు, అమలాపురంలో 11 కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. 5,224 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఆయన వెంట తహశీల్దా ర్ పి.శ్రీపల్లవి, తదితరులున్నారు.

ఉపాధి పనుల వేగవంతానికి పిలుపు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలో ఉపాధి పనులను వేగవంతం చేయాలని ఎంపిడిఒ నాతి బుజ్జి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కూలీలకు రోజుకు రూ.272 అందేలా కొలతలు ఇచ్చి పనులు చేయించాలని ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లను ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు అన్ని గ్రామాల్లో పనులను చేయించాలన్నారు. పని ప్రదేశంలో వేతనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎపిఒ విజయభారతి, సాంకేతిక సహాయకులు సత్యనారాయణ, అజయ్, కంప్యూటర్ ఆపరేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



డిటికి వినతిపత్రం అందిస్తున్న హరీష్, నామన

రైతులకు తీరని అన్యాయం

ప్రజాశక్తి - అంబాజీపేట

వైసిపి ప్రభుత్వం రైతులకు తీరని అన్యాయం చేస్తుందని టిడిపి పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ గంటి హరీష్‌మాథూర్ అన్నారు. ధాన్యం విక్రయాలపై రైతుల సమస్యలను పరిష్కరించాలని డిప్యూటీ తహశీల్దార్ పి.నాగ పద్మలతకి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యం కారణంగానే వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చే సమయంలో వర్షాల పాలైందన్నారు. దీంతో రైతులు నష్టాల బారిన పడ్డారని తెలిపారు. అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. వారిని ఆదుకోవాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మాజీ జడ్‌పి ఛైర్మన్ రాంబాబు మాట్లాడుతూ పాడైపోయిన పంట నష్టం అంచనా వేసి త్వరితగతిన పరిహారం చెల్లించాలన్నారు. రంగు మారిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వక్కలంక బుల్లియ్య, రాష్ట్ర నాయకులు డొక్కా నాథ్‌బాబు, మోకా ఆనంద్ సాగర్, మండల కార్యదర్శి గుడాల ఫణి, ఆరుమిల్లి లాల్‌బాబు, గంగుమళ్ల వీరభద్రరావు, జివి.రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

మాతా, శిశు మరణాల తగ్గింపునకు చర్యలు

ప్రజాశక్తి - అమలాపురం

మాతా, శిశు మరణాల రేటును తగ్గించడంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో కీలక భూమిక పోషించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా మాతాశిశు మరణాల సర్వే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఆశాలు, ఎఎన్‌ఎంలు, అంగన్‌వాడీలు గర్భిణులను గుర్తించాలన్నారు. గర్భం దాల్చిన నాటి నుంచే వారికి వైద్య పరీక్షలు చేయించాలన్నారు. గర్భిణుల్లో రక్తహీనత, పోషకాహార లేమిని చక్కదిద్దడంలో ఇరు శాఖలు కీలక భూమిక పోషించాలని ఆదేశించారు. ప్రసవం కోసం పుట్టింటికి వెళ్లే గర్భిణుల కేస్ షీట్‌లో ఆరోగ్య స్థితిగతులు పూర్తిగా నమోదు చేయాలన్నారు. ఇటీవల ప్రభుత్వం ఆరోగ్య స్థితి గతుల మానిటరింగ్ కొరకు ఆన్లైన్ యాప్‌లను తీసుకొచ్చిందన్నారు. ప్రసవ తేదీకి వారం రోజులు ముందుగానే ఆసుపత్రులకు తరలించి సుఖప్రసవాలు నిర్వహణకు పాటు పడాలన్నారు. రిస్క్ కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో గత నాలుగు మాసాల్లో సంభవించిన రెండు శిశు మరణాలు, రెండు మాతృ మరణాలపై వైద్యాధికారులను ఆరా తీశారు. ఇకపై ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చేపట్టాల్సిన చర్యలు గూర్చి వివరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి పద్మశ్రీరాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.దుర్గారావుదొర, జిల్లా స్త్రీ శిశుసంక్షేమ శాఖ అధికారి జివి.సత్యవాణి, అదనపు డిఎంహెచ్ఒ భరతలక్ష్మి వైద్యాధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న హరీష్‌మాథూర్, నామన తదితరులు

టిడిపి నేత శ్యామలరావుకు నివాళి

ప్రజాశక్తి - అంబాజీపేట

శ్యామలరావు మతి పార్టీకి తీరని లోటని పి.గన్నవరం నియోజకవర్గ టిడిపి కన్వీనర్ గంటి హరీష్‌మాథూర్, జడ్‌పి మాజీ ఛైర్మన్ నామన రాంబాబు అన్నారు. ఇరుసుమండలో సోదర వియోగంతో బాధపడుతున్న టిడిపి సీనియర్ నాయకులు చిన్నం బాలవిజయరావు కుటుంబాన్ని వారు బుధవారం పరామర్శించారు. బాలవిజయరావు సోదరుడు శ్యామలరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. వారి వెంట టిడిపి నాయకులు వక్కలంక బుల్లియ్య, మోకా ఆనంద్‌సాగర్, నేదునూరి వీర్రాజు, బొంతు పెదబాబు, జివి.రాఘవులు, గోగి రమేష్, నాగాబత్తుల వెంకటసుబ్బారావు ఉన్నారు.

ఘనంగా పివి.రావు జయంతి

ప్రజాశక్తి - యంత్రాంగం

మాలమహానాడు వ్యవస్థాపకులు పివి.రావు జయంతిని జిల్లాలో పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. **అయినవిల్లి** మండలం ముక్తేశ్వరం సెంటర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద పివి.రావు చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేశారు. కేక్ కట్ చేసి పంచారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌బిఆర్ఎమ్ కాలేజ్ వైస్ ప్రెసిడెంట్ యళ్లమిల్లి బాలకృష్ణ, గిడ్ల వెంకటేశ్వరావు, బొంతు రాజేంద్రప్రసాద్, కాకర బాబ్జి, చినబాబు, వారా లక్ష్మీనరసింహం, పెట్టా జగన్ తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం** మండలం ఎన్.కొత్తపల్లి పంచాయతీ ముళ్ల వారి పేటలో పివి.రావు జయంతిని నిర్వహించారు. మాల మహానాడు మండల కన్వీనర్ కొంకి వెంకటబాబ్జి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పివి.రావు విగ్రహానికి సర్పంచ్ కుంచే చిట్టికుమారి, మాల మహానాడు నాయకులు కొంకి బాబూరావు, కుంచే చిన్ని, కొంకి రాజారావు, పండు రాజేష్, నేరేడుమిల్లి సత్తిబాబు, కె.బాలకృష్ణ, నందిక రమేష్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. **మామిడికుదురు** సెంటర్‌లో అంబేద్కర యువజన సంఘం ఆధ్వర్యంలో పివి.రావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు కలిగితి పల్లంరాజు, నీతిపూడి చంద్రరావు, భూపతి వెంకటపతి, నీతిపూడి మహేష్, ఎంపిటిసి సభ్యులు నెల్లి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పలగుప్తం మండలంలో పివి.రావుకు నివాళులర్పిస్తున్న నాయులు



లోకేష్‌తో సంజీవ్

లోకేష్ పాదయాత్రలో బండారు సంజీవ్

ప్రజాశక్తి - కొత్తపేట

యువగళం పేరిట టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేస్తున్న పాదయాత్ర 100వ రోజుకు చేరుతున్న సందర్భంగా కర్నూలు జిల్లా నందికొట్కూరులో లోకేష్‌ను టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, బండారు సత్యానందరావు తనయుడు బండారు సంజీవ్ కలిశారు. లోకేష్‌తో పాటు పాదయాత్రలో పాల్గొన్నారు.. పాదయాత్ర దిగ్విజయంగా ముందుకెళుతోందని, ప్రజల నుంచి వస్తున్న స్పందన చాలా బాగుందని సంజీవ్ తెలిపారు. పాదయాత్ర వంద రోజులు పూర్తవుతున్న సందర్భంగా నియోజకవర్గ కేంద్రాల్లో కొత్తపేటలో పార్టీ చేపట్టనున్న పాదయాత్ర వివరాలను ఆయన లోకేష్‌కు వివరించారు.



విఆర్‌ఒను సత్కరిస్తు శ్యామ్ తదితరులు

విఆర్ఒ రామయ్యకు సన్మానం

రామచంద్రపురం : మండలంలోని వెంకటాయపాలెంలో విఆర్‌ఒగా సేవలందించిన రవ్వ రామయ్య ప్రమోషన్‌పై బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, వైసిపి నాయకులు బుధవారం ఆయనకు వీడ్కోలు సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి ఐడిసి డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్ మాట్లాడారు. విఆర్ఒ సేవలను కొనియాడారు. ఆయన సీనియర్ అసిస్టెంట్‌గా ప్రమోషన్‌పై వెళ్లడం హర్షణీయమన్నారు. రానున్న కాలంలో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయన్ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాపనయ్య చెరువు సర్పంచ్ పిల్లి ప్రకాష్, వైసిపి నాయకులు ఎల్లమెల్లి రవికుమార్, కార్యదర్శి పిల్లి త్రినాథ్, కన్వీనర్ దడాల రవికుమార్, ఇన్‌ఛార్జి విఆర్ఒ వి.రామకృష్ణ, గ్రామస్తులు పాల్గొనానరు.

కార్టూ'నిజం'



ఇలాగైతే పంచాయతీల్లో మన పార్టీ ఖాళీ సార్..!!

ముమ్మరంగా ఉపాధి పనులు

ప్రజాశక్తి - మండపేట

మండలంలోని 12 గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మేజర్ పంచాయతీలు ఏడిద, ద్వారపూడి, కేశవరం, ఇప్పనపాడు గ్రామాల్లో చెరువు పూడికతీత పనులు, మిగిలిన పంచాయతీల్లో ఫీల్డ్ కెనాల్ పనులను నిర్వహిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువుల్లో వర్షపు నీరు నిలిచి పోవడంతో చెరువు పూడికతీత పనులు నిలిచిపోయాయి. అన్ని గ్రామాల్లో ఫీల్డ్ కెనాల్ పనులే జరుగుతున్నాయి.



ఇప్పనపాడులో జరుగుతున్న ఉపాధి పనులు

కొరవడిన పర్యవేక్షణ

మండలంలో జరుగుతున్న ఉపాధి పనులపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందని పలువురు ఆరోపిస్తున్నారు. రెండు రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా వున్న నేపథ్యంలో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పని ప్రదేశాల్లో ఉన్న చెట్ల కిందనే వారు సేద తీరుతున్నారు. ఇదిలా ఉండగా మండలంలోని ఇప్పనపాడు జమ్ము కాలవ పూడికతీత పనులను అదే గ్రామానికి చెందిన 40 మంది ఉపాధి కూలీలు చేస్తున్నారు. పని ముగించుకుని ఇళ్లకు వెళ్లారు. అనంతరం అధికారులు పని ప్రదేశానికి వచ్చారని, తనిఖీలు చేస్తారని తిరిగి పని ప్రదేశానికి రావాలన్నారని పలువురు కూలీలు తెలిపారు. దీంతో ఎండలో నడిచి పనిప్రదేశానికి వెళ్లాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా పనులు జరిగే సమయంలోనే తనిఖీలు చేయాలని కూలీలు కోరుతున్నారు.



టేకు సింహాసనం అందిస్తున్న బాబి దంపతులు

బాలబాలాజీ స్వామికి టేకు సింహాసనం బహూకరణ

ప్రజాశక్తి -మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామివారి సన్నిధిలో ఉత్సవమూర్తులను ప్రతిష్టాపించేందుకు బోడసుకుర్రు గ్రామానికి చెందిన చింతా నాగేశ్వరరావు, మంగాదేవి దంపతుల కుమారుడు బాబి, ఆయన సతీమణి పార్వతి కుటుంబ సభ్యులు రూ.50వేల విలువైన టేకు సింహాసనాన్ని బుధవారం సమర్పించారని ఆలయన ఎసి ప్రసాదరావు తెలిపారు. ఆలయ అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి కళ్యాణం సందర్భంగా బుధవారం పందిరి రాట పాతారు. ఆలయ ఛైర్మన్ సిహెచ్.రామకృష్ణ, ధర్మ కర్తల మండలి సభ్యులు గుత్తుల భానుప్రకాష్, గూటం శ్రీనివాస్, పెదమల్లు ఉషారాణి, బత్తుల విజయ గంగారత్నం, బొరుసు పార్వతీ దుర్గా భవాని, ఆలయ ఉప ప్రధాన అర్చకులు మద్దాలి తిరుమల శింగరాచార్యులు దాతకు ప్రసాదం ఇచ్చి సత్కరించారని కార్యనిర్వహణ అధికారి దాసరి రామవరప్రసాద్ తెలిపారు.

ఆధార్ నమోదుపై అవగాహన

ఆత్రేయపురం : 18 ఏళ్లు నిండిన వారికి కొత్తగా ఆధార్ నమోదుపై సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు అవగాహన కలిగి ఉండాలని ఎంపిడిఒ నాతి బుజ్జి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అంగన్‌వాడీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు ఎఎన్‌ఎంలతో ఆమె సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం అంగన్‌వాడీ సెంటర్లలో ఎవరైతే పిల్లలు ఆధార్ నమోదు చేయించుకోకుండా ఉన్నారో వారందరికీ ఆధార్ చేయించుకొనేలా చూడాలన్నారు.

రైతు పోరుబాట జయప్రదానికి పిలుపు

రావులపాలెం : టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఈనెల 12న పశ్చిమగోదావరి జిల్లా తణుకులో చేపట్టిన రైతు పోరుబాటను జయప్రదం చేయాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కొత్తపేట మాజీ ఎంఎల్ఎ బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. 12వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు రావులపాలెంలోని టిడిపి కార్యాలయం నుంచి పార్టీ రైతు విభాగం సభ్యులు, నేతలు, కార్యకర్తలు, రైతులతో కలిసి ఈ కార్యక్రమానికి వెళ్తారని తెలిపారు. రైతు సమస్యల పరిష్కారమే ధ్యేయంగా చంద్రబాబు ఆధ్వర్యంలోని టిడిపి పనిచేస్తుందని సత్యానందరావు వివరించారు.

నేరాలు ఘోరాలు

బాలికపై అత్యాచారం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ఒక బాలికను అపహరించి అత్యాచారం చేసిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని ఒక గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన యువకుడు తన స్నేహితుడు సాయంతో మాయ మాటలు చెప్పి అపహరించాడు. ఆపై ఆమెపై అత్యాచారం చేశాడు. ఈ విషయాన్ని బాలిక తండ్రికి చెప్పగా ఆమె పోలీసులు ఆశ్రయించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సిహెచ్.సుధాకర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

ప్రజాశక్తి-రాజానగరం

రాజానగరం జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మతి చెందారు మరొక తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై ఎస్ఐ జుబేదార్ తెలిపిన వివరాలివి. వైజాగ్ నుంచి రాజమహేంద్రవరం వైపుకు ఐరన్ లోడుతో ట్రాలీ లారీ వెలుతూ మరమ్మతు రావడంతో గైట్ కళాశాల సమీపంలో కుడివైపు ఆగింది. అదే రహదారిలో శ్రీకాకుళం నుంచి రాజమహేంద్రవరంలో పెళ్లికి ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వెళుతోంది. బస్సు డ్రైవర్ అజాగ్రత్తగా నడపడం వల్ల ఆగి ఉన్న ట్రాలీ లారీని ఢీ కొట్టాడు. దీంతో డ్రైవర్ ప్రక్కన ఉన్న అదనపు బస్సు డ్రైవర్ ఆలీ(47) అక్కడికక్కడే మతి చెందాడు. బస్సు డ్రైవర్ రెండు కాళ్లు లారీలో ఇరుక్కుపోయాయి. ఎస్ఐ జుబేదార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది డ్రైవర్‌ను బయటకు తీసే ప్రయత్నం చేశారు. లారీలో నుంచే ఇరుక్కుపోయిన డ్రైవర్‌కు అత్యవసర చికిత్స అందించారు. సుమారు మూడు గంటల డ్రైవర్‌ను 108లో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మరణం

ప్రజాశక్తి -గోకవరం

విద్యుత్ ఘాతానికి గురై వ్యక్తి మతి చెందిన సంఘటన బావాజీపేటలో చోటు చేసుకుంది పోలీసులు కథనం ప్రకారం.. గోకవరం మండలం వెదురుపాక గ్రామానికి చెందిన చినుబోయిన వెంకటేష్ (42) బుధవారం తమ కుమార్తె వివాహం నిమిత్తం పోలవరం కాలువ ఎడమ గట్టుమీద కర్రలను నరుకుతున్నాడు. గట్టు మీదుగా వెళ్ళిన హైటెన్షన్ విద్యుత్ వైర్లకు కర్రలు తగిలి వెంకటేష్ అక్కడికక్కడే మతి చెందాడు.

వ్యక్తి మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి -రామచంద్రపురం

పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద గల సృజన ఫర్నీచర్ షాప్ ఎదురుగా బుధవారం ఒక వ్యక్తి మృతి చెందాడు. మృతుని పి.శ్రీనివాస్(36)గా గుర్తించామని పోలీసులు తెలిపారు. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో ఈ ఏడాది ఏప్రిల్ 22 నంచి చికిత్స పొందినట్టు తెలిసిందన్నారు. మిగిలిన వివరాలు తెలియరాలేదని రామచంద్రాపురం ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపారు.

మహిళ హత్యపై దర్యాప్తు వేగవంతం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ఆత్రేయపురం చినపేటలో దళిత మహిళ మంగళవారం హత్య గురైన సంఘటనలో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. బుధవారం కొంతమంది అనుమానితులను గుర్తించి విచారించారు. హత్య జరగడానికి గల కారణాలు గురించి ఎస్ఐ సిహెచ్ సుధాకర్ ఆరా తీస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి-సీతానగరం

మంగళవారం రాత్రి చినకొండేపూడి గ్రామంలో ఎస్ఈబి సిఐ ఆధ్వర్యంలో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా పరిషత్ హై స్కూల్ వెనుక మామిడి తోటలో పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.11,360 నగదు, ఐదు సెల్ ఫోన్లు, మూడు బైకులు స్వాధీనం చేసుకున్నారు. వారిని బుధవారం కోర్టులో హాజరు పరిచామని పోలీసులు తెలిపారు.

వెంకన్న హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి-పెరవలి

అన్నవరప్పాడులో జాతీయ రహదారి పక్కన ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి హుండీలను బుధవారం తణుకు తనిఖీదారు సమక్షంలో లెక్కించారు. 28 రోజులకు రూ.2,96,551 ఆదాయం వచ్చినట్లు దేవస్థాన ఇఒ శ్రీనివాస్ తెలిపారు.

రైతు భరోసా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

సర్పవరం గ్రామంలో రూ.25.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం కాకినాడ ఎంపీ వంగా గీత, కలెక్టరు కృతికా శుక్లా, ఎంఎల్ఎ కన్నబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ గ్రామ సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలకు సంబంధించి బిల్లులు విడుదలైన నేపథ్యంలో వేగవంతంగా ప్రభుత్వ శాశ్వత భవనాలు పూర్తి చేస్తున్నట్టు చెప్పారు. ఇంకా నిధులు అవసరమైన చోట ప్రభుత్వంతో మాట్లాడి సమకూరుస్తామన్నారు. రైతులకు అన్ని సేవలు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి 50 శాతం పంట కోతలు పూర్తయ్యాయని, పంటలు కోసిన రైతుల నుంచి ఆర్‌బీకేల ద్వారా ధాన్యం సేకరణ చేపట్టామన్నారు. ఎంఎల్ఎ కన్నబాబు మాట్లాడుతూ ఇటీవల కాలంలో కురిసిన అకాల వర్షాల కారణంగా కొంత మేర పంట నష్టం వాటిల్లిందని.. కొన్ని చోట్ల పంట కోసిన ధాన్యం తడిసి పోవడం వల్ల రైతులు కొంతమేర ఇబ్బంది పడ్డారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎప్పటికప్పుడు అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షించి అప్రమత్తం చేశారన్నారు. పంట నష్టం అంచనాకు సంబంధించి నష్టపోయిన ప్రతి ఎకరానికి ఇన్‌పుట్ సబ్సిడీ అందించే విధంగా ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చినట్టు తెలిపారు. రైతు భరోసా కేంద్రం ద్వారా రైతుల నుంచి సేకరిస్తున్న ధాన్యం సేకరణలో 21 రోజుల్లోనే రైతులు ఖాతాలో సొమ్ము జమవుతుందని, జిల్లాలో పూర్తి పారదర్శకంగా ధాన్యం సేకరణ ప్రక్రియ జరుగుతోందని రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన పనిలేదని చెప్పారుఏ. ప్రభుత్వం అన్ని విధాలుగా రైతులకు అండగా ఉంటుందని అనంతరం కలెక్టరు కృతికా శుక్లా ధాన్యం కొనుగోలు చేసిన రైతులకు స్లిప్పులను అందజేశారు.

యానాం వార్తలు



రామన్నకోడులో ఎంఎల్ఎ అశోక్ పుట్టిన రోజు వేడుకలు

ఘనంగా ఎంఎల్ఎ అశోక్ పుట్టిన రోజు

ప్రజాశక్తి - యానాం

యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పుట్టినరోజు వేడుకలు అభిమానులు ఘనంగా నిర్వహించారు. అభిమానులు కార్యకర్తలు అధిక సంఖ్యలో ఎంఎల్ఎ కార్యాలయానికి చేరుకుని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక కె జంక్షన్, పాత బస్టాండ్, రామన్నకోడు, సీతమ్మ పేట, గణపతి నగర్, త్యాగరాయ వీధి తదితర గ్రామాల్లో కేకులు కట్ చేసి స్వీట్లు పంచారు. ఆర్ఎఒ మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ దిజ్ గోయల్, సిఐ షణ్ముగం, ఎస్ఐలు శేరు నూకరాజు, పువ్వుల వీరభద్ర స్వామి, ప్రభుత్వ అధికారులు, వివిధ సంఘాల నాయకులు ఎంఎల్ఎ అశోక్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో గొల్లపల్లి అభిమానులు, కార్యకర్తలు, మహిళలు యువకులు పాల్గొన్నారు.



విద్యుశాఖ ఎఇ తో మాట్లాడుతున్న మల్లాడి

విద్యుత్ శాఖ ఎఇతో మల్లాడి సమావేశం

యానాం ప్రాంతంలో విద్యుత్ సమస్యలపై విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సిందిల్ కుమార్‌తో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు బుధవారం సమావేశమయ్యారు. నియోజకవర్గంలో ఉన్న విద్యుత్ సమస్యలపై చర్చించారు. తీర గ్రామాల్లో లో-ఒల్టేజ్ సమస్య ఉందని అందుకు ప్రత్యేక లైన్ వెయ్యాలని,పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. డంపింగ్ యార్డ్ విద్యుత్ సబ్ స్టేషన్ వద్దకు మార్చడాన్ని గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని ఈ మేరకు వినతి పత్రాన్ని అందించారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ కురసాల కన్నబాబు

ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి -కరప

రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించ డమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ పరిపాలన సాగిస్తున్నారని రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన కరప గ్రామంలో పర్యటించి రామాకంచిరాజు నగర్, పల్లిపేట నక్కా వారి పేట నందు ప్రతీ ఇంటిని సందర్శించి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. జడ్‌పిటిసి యాళ్ల సుబ్బారావు, ఎంపిపి పెంకే శ్రీలక్ష్మి, గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి కుమార్, వైస్ ఎంపిపి భీమన్న, రెడ్డి భద్రం, మద్దూరి భాస్కరరావు, భోగిరెడ్డి సూర్యనారాయణ, నక్కా సత్తిబాబు, నక్కా భద్రం,ఎం సత్తిబాబు పాల్గొన్నారు



బస్ షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన కురసాల సత్యనారాయణ

బస్ షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -కరప

వేంగి గ్రామంలో బుధవారం గ్రామ సర్పంచ్ నీలిమ రాజేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నూతనంగా నిర్మిస్తున్న బస్సు షెల్టర్ నిర్మాణానికి కాకినాడ రూరల్ అభివద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ శంకు స్థాపన చేశారు. రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు ఈ నిర్మాణానికి రూ.5 లక్షల నిధులు కేటాయించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి యాళ్ళ సుబ్బారావు, ఎంపిపి పెంకే శ్రీలక్ష్మీ సత్తిబాబు, పంచాయతీ సెక్రటరీ పి.శ్రీనివాస్, జి.బావ వరం సర్పంచ్ రొక్కల గనిరాజు, ఎంపిటిసి సభ్యులు ముషిణి సూరిబాబు, వార్డు సభ్యుడు మట్టపర్తి దుర్గారావు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గరగ జెమ్మి, కుంచె సాంబమూర్తి, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

63 ఏళ్లుగా సేవా సమితి సేవలు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవంలో కీ.శే. వింజమూరి విశ్వనాథం గౌరవ అధ్యక్షులుగా, తోటకూర సూర్యనారాయణల అధ్యక్షతన ఏర్పడిన శ్రీ శారదా రామకృష్ణ సేవా సమితికి నేటితో 63 ఏళ్ల పూర్తైనట్లు సమితి ప్రస్తుత అధ్యక్షులు తోటకూర గంగాధర్ చెప్పారు. 1960 మే11 వ తేదీన తమ తండ్రి కి.శే సూర్యనారాయణ, వింజమూరి విశ్వనాథంలు గ్రామంలో విద్యాభివృద్ధి లక్ష్యంగా సేవా సమితిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం వింజమూరి, తోటకూర వంశీయుల పర్యవేక్షణలో సుమారు 50 మంది సభ్యులతో సంస్థ సేవలను కొన సాగి స్తున్నామన్నారు. గ్రామంలో 1వ తరగతి నుండి 6వ తర గతి వరకూ విద్యాబోధన, 7 నుండి 10 తరగతులకు వేసవిలో ప్రతీఏటా ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహణ, 10వ తరగతి విద్యార్థులకు విశ్వనాథ విద్యా ప్రకాశిని పేరిట స్టడీ మెటీరియల్ పంపిణీ, ఉత్తమ మార్కులు పొందిన టెన్త్ విద్యార్థులకు ప్రతీ ఏటా నగదు పురస్కారాలు అందజేత, ప్రతి నెలా పేదలు 50 మందికి బియ్యం పంపిణీ, ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పంపిణీ, మహిళలకు ఉచిత కుట్టు శిక్షణలు, కుట్టు మిషనులు ఇచ్చి ఉపాధి కల్పన తదితర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



విద్యార్థులకు బోధనాంశాన్ని వివరిస్తున్న ఉపాధ్యాయుడు

మూడో రోజుకు వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

జగన్నాధపురం గ్రంథాలయ సంస్థ లైబ్రరీ కే కిషోర్ ఆధ్వర్యంలో మూడో రోజు నిర్వహించిన వేసవి శిబిరంలో విశ్రాంత ఉపాధ్యాయులు నోరు బలరామకృష్ణ పోలీస్ కిట్లను చేసి విద్యార్థులకు వివరించారు. ఎస్ఆర్ రత్నం, ఉపాధ్యాయులు మధ్యాహ్నం సమయంలో విద్యార్థులకు భోజన వసతి కల్పించారు. గాంధీనగర్ లైబ్రరీలోఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. సుమారు 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



పైపులైన్లను మరమ్మత్తులు చేయిస్తున్న అధికారులు

తాగునీటిపై పైపులైన్లకు మరమ్మతులు

ప్రజాశక్తి - తుని

పట్టణంలోని30 వార్డులో పబ్లిక్ కుళాయిల ద్వారా తాగునీరు నల్లగా వస్తుందని తుని మున్సిపల్ చైర్ పర్సన్ ఏలూరు సుధారాణికి స్థానిక ప్రజలు ఫిర్యాదు చేశారు. వేసవికాలంలో ప్రజలు తాగునీటి ఎద్దడికి గురికాకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ విషయాన్ని చైర్‌పర్సన్ మంత్రి దాడిశెట్టి రాజా దృష్టికి తీసుకుని వెళ్లారు. దీనిపై బుధవారం మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపదికన పైపులైన్ల మరమతు పనులు చేపట్టారు. పైపులైన్లతో పాటు పంపు సెట్లను కూడా పరిశీలించి అవసరమైన చోట్ల ప్రతిచోట పైపులైన్లు కొత్తవి వేయనున్నట్టు కమిషనర్ తెలిపారు. ఉప్పరగూడెం వైయస్సార్ కాలనీలోనూ తాగునీటి ఎద్దడి అధికంగా ఉందని ప్రజలు చెబుతున్నారు. ప్రైవేట్ ఏజెన్సీ నుండి తాగునీటిని కొనుగోలు చేసుకోవలసిన పరిస్థితి ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. పైపులైన్ల మరమ్మతు పనులను చైర్‌పర్సన్ సుధారాణి బాలు, కమిషనర్ కౌన్సిలర్లు పర్యవేక్షిస్తు న్నారు.



ప్రజల తో మాట్లాడుతున్న సుధారాణి బాలు

మూడో రోజు 'మన మున్సిపాలిటీ మన బాధ్యత'

ప్రజాశక్తి - తుని

తుని పట్టణంలో బుధవారం మూడో రోజు మన మున్సిపాలిటీ మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా తుని పట్టణ 22వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరు సుధారాణి బాలు ప్రజా సమస్యలను విని వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు ఎంతో కాలంగా ఉన్న దీర్ఘకాలిక సమస్య లకు ఈ కార్యక్రమం ద్వారా పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. కార్యక్ర మంలో వైస్ చైర్మన్ పామర్తి మహేష్, కౌన్సిలర్ జీవరత్నం, అనిశెట్టి సూర్యచక్ర రెడ్డి, బోడపాటి శ్రీను, మున్సిపాలిటీ కమిషనర్ ప్రసాద్ రాజు తదితరులు పాల్గొన్నారు.



డి-సిల్టేషనులు పనులు పరిశీలిస్తున్న ఎడిసి నాగనరసింహారావు

పూడికతీత పనులు వేగవంతం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ నగరంలో జరుగుతున్న పూడికతీత పనులను వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు ఆదేశించారు. బుధవారం ఆయన చీడీలపొర మెయిన్ డ్రైన్ పూడిక తీత పనులను పర్యవేక్షించారు. పనులను మరింత వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. ఇంజనీరింగ్, పారిశుధ్య విభాగాలు సమన్వయంతో పనులు పూర్తి చేయాలని సూచించారు. వర్షాలు పడే లోపుగా పూడికతీత పనులన్నీ పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా తడి పొడి చెత్త సేకరణ తీరును పరిశీలించారు. ప్రజలు చెత్తను విభజించి ఇస్తున్నారో లేదో పర్యవేక్షించారు. చెత్త సేకరణకు పారిశుధ్య కార్మికులు సకాలంలో వస్తున్నారో లేదో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్తెప్ప నాయుడు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

వికలాంగునికి సాయం అందజేత

ప్రజాశక్తి - అయినవిల్లి

అయినవిల్లి మండలం పోతుకుర్రులో వికలాంగుడు మాగాపు వెంకట్రావును ఎంఎల్‌సి ఇజ్రాయిల్ బుధవారం పరామర్శించారు. ఆరోగ్య ఖర్చుల నిమిత్తం రూ.5వేల సాయం అందించారు. అలాగే ఇటీవల కరెంట్ షాక్‌తో మృతి చెందిన పోతుకుర్రుకు చెందిన సవరపు గోపికృష్ణ కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు కమిడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి పుల్లంశెట్టి ,ఉప సర్పంచ్ ఆకుమర్తి దుర్గారావు, సొసైటీ చైర్మన్ చిలుకూరి నరసింహరాజు, ఎఎంసి మాజీ డైరెక్టర్ చేట్ల రామారావు, పెదపూడి నాగేశ్వరరావు, దాసరి రాంబాబు తదితరులున్నారు.



సాయం అందిస్తున్న ఎంఎల్‌సి ఇజ్రాయిల్

మెరిట్ విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి - అమలాపురం

తల్లిదండ్రులు దూరమైనా విద్యలో ప్రతిభను చూపించి 10వ తరగతి ఫలితాల్లో అధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వన్నెచింతలపూడిలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన బిరుదుగంటి దిలీప్‌ను పివికె ఎథిక్స్ ది చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అభినందించారు. ఎస్ఎఫ్ఐ అమలాపురం మాజీ కార్యదర్శి పి.లెనిన్‌బాబ్జి బుధ వారం వన్నె చింతలపూడిలో దిలీప్‌కు జ్ఞాపికను, ఉన్నత చదువులకు అవసరమైన పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా లెనిన్ మాట్లాడుతూ తండ్రి మరణం తనను బాధించిందన్నారు. వసంత కుమార్ ఆశయాలను కొనసాగిస్తామన్నారు. ఆయన పేరున ట్రస్టును ఏర్పాటు చేశామన్నారు. పేదలకు చేయూతనిచ్చే విధంగా ఈ సంస్థను నడుపుతామని అన్నారు. పేదలను విద్యావంతులుగాను తీర్చిదిద్ది సమాజానికి ఉన్నతమైన పౌరులను అంధించడమే ప్రధాన ఏజెండాగా ట్రస్ట్‌ను నెలకొల్పామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కోనసీమ జిల్లా కోకన్వీనర్ బీమాల గౌతం, విద్యార్థి దిలీప్ వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థులకు జ్ఞాపికలు అందిస్తున్న లెనిన్



సచివాలయంలో నేత్ర వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

నేత్ర వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - మండపేట

జగనన్న కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ చిట్టూరి సతీష్ అన్నారు. బుధవారం సచివాలయం-1లో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ వైద్య శిబిరంలో 70 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. 50 మందికి ఐ.డ్రాప్స్ పంపిణీ చేశారు. వారికి త్వరలో కళ్లజోళ్లు అందిస్తామన్నారు. మిగిలిన వాటికి మందులు అందించారు. శస్త్ర చికిత్స అవసరమైన వారికి రామచంద్రపురం ప్రభుత్వ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయిస్తామని ఆప్తాలమిక్ ఎస్.సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ నమోదుకు చర్యలు

ప్రజాశక్తి - మండపేట

ఆరు నెలల నుంచి ఆరేళ్ల వయస్సుగల చిన్నారుల ఆధార్ నమోదుకు చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ డి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం రాయవరం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల ప్రకారం మండలంలో 6నెలల వయస్సులోపు ఉన్న 74 మంది, 6 ఏళ్లలోపు వయస్సు కలిగిన 398 మంది చిన్నారుల ఆధార్ నమోదుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయుష్మాన్ భారత్ గురించి ప్రగతి నివేదికలు అందజేయాలన్నారు.



స్నేహితుని కుటుంబానికి సాయం చేస్తున్న భీమశంకరం స్నేహితులు

స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని పెదపళ్లకు చెందిన కాళ్లకూరి భీమశంకరం(44) కార్డియాక్ అరెస్టుతో గతవారం అకాల మతి చెందారు. భీమశంకరం కుటుంబానికి అతని చిన్ననాటి స్నేహితులు అండగా నిలిచారు. రూ.60 వేల ఆర్థిక సాయాన్ని భీమశంకరం తల్లిదండ్రులకు బుధవారం అందించారు.

చలివేంద్రాలతో దాహార్తులకు సేవ

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

మండే ఎండల్లో కొవ్వూరు ఆసుపత్రికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతో దోహదపడతాయని రాష్ట్ర హోమ్ మంత్రి తానేటి వనిత అన్నారు. బుధవారం కొవ్వూరు ఆసుపత్రి ప్రాంగణంలోని ఆసుపత్రి అభివద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు, ప్రజలకు మంత్రి మజ్జిగను పంపిణీ చేశారు. ఉచిత మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసిన సభ్యులు వరిగేటి సుధాకర్, నగళ్లపాటి శ్రీనివాసరావును ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి వనిత

టి 10 ఫాస్ట్ టోర్నమెంట్ ప్రారంభం

పట్టణంలోని 15వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, సతీష్ ప్రవీణ్, శివ ఫ్రెండ్స్ ఏర్పాటు చేసిన ఫ్రెండ్స్ టి10 ఫాస్ట్ టోర్నమెంట్‌ను మంత్రి డాక్టర్ తానేటి వనిత ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో సుమారు 20 గ్రామాల నుంచి 30 టీములు పాల్గొంటున్నాయి, ఈ పోటీల్లో విజయం సాధించిన వారికి మొదటి బహుమతిగా రూ.20,000, ద్వితీయ బహుమతిగా రూ.10,000 అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రుత్తాల భాస్కరరావు, సర్లే నగేష్, డాక్టర్ మల్లేశ్వరరావు చిట్టూరి అన్నవరం, సూరిబాబు సందీప్, వాసు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యంలో ప్రతిభకు ప్రోత్సాహం

ప్రజాశక్తి-తాళ్లపూడి

ఏ స్థాయి చదువులోనైనా ఉన్నత ప్రతిభ కనబరిచి అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్న విద్యార్థులను మరింత ఉన్నత చదువుల కోసం అన్ని విధాల ప్రోత్సహించాలని పలువురు మానవత సభ్యులు అన్నారు. గడచిన విద్యా సంవత్సరం ఆఖరున జరిగిన ఇంటర్, 10వ తరగతి పరీక్షలలో ఉన్నత ర్యాంకులు సాధించిన 20 మంది విద్యార్థులను మండల మానవత శాఖ నగదు ప్రోత్సాహంతో ఘనంగా సత్కరించింది. తాళ్లపూడిలోని సొలస సత్యనారాయణ దమయంతి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో బుధవారం జరిగిన ఈ ప్రోత్సాహక కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు సింహాద్రి జనార్దన్‌రావు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మానవతా తరపున ఒక్కొక్కరికీ రూ.1500 నగదు పెన్నులు, మెమెంటో, సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా మానవత అధ్యక్షులు జోడాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యా వైద్య రంగాలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు అనేక రూపాల్లో సహకరిస్తున్న మానవత సేవా సంస్థలు ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకునే సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు కార్యదర్శి సుబ్బారావు అప్పన చంద్రధరగుప్త, ఉపాధ్యాయులు ప్రమోద్ కుమార్ మూర్తి, హనుమంతరావు, శ్రీరామచంద్రమూర్తి విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మానవత సంస్థ సభ్యులు